క్లుప్తంగా

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవం రేపు

రేపల్లె రూరల్: మండలంలోని కారుమూరు గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవం బుధవారం ఉదయం 9.27 గంటలకు జరుగుతుందని ఆలయ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

'స్పందన'కు 8 అర్జీలు

రేపల్లె: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎనిమిది అర్జీలు అందినట్లు తెలిపారు. నిత్యావసరాల ధరల నియంత్రణ, ఆహార కమిటీ ఏర్పాటు చేసి.. సమావేశాలు నిర్వహించాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు అర్జీ ఇచ్చినట్లు చెప్పారు. అదే విధంగా అడంగల్ నమోదుకు మూడు, రహదారి నిర్మాణానికి ఒకటి, ఇతర అంశాలపై మరో మూడు అర్జీలు అందాయన్నారు. వాటిని పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: మరమ్మతుల కారణంగా.. పట్టణంలోని అరవపల్లి రోడ్డు, పెనుమూడి రోడ్డు, అంకమ్మ చెట్టు సెంటరు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ పి.ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని పేర్కొన్నారు.

తక్షణ సాయం అందజేత..

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని 1వ సచివాలయం పరిధిలోని హసన్‌బేగ్ అనే వ్యక్తి సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద రూ. 10 వేలు తక్షణ సాయాన్ని కుటుంబ సభ్యులకు సర్పంచ్ దారా రవి కిరణ్మయి అందజేశారు. మృతుడి భార్య రిజ్వానాకు ఆమె భరోసా కల్పించారు. వార్డు సభ్యులు సయ్యద్ ఇస్మాయిల్, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, ఎంపీటీసీ కొతరపు పద్మావతి, వెల్ఫేర్ అసిస్టెంట్ వాగోలు సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

వితంతవుపై అత్యాచారం

బాపట్లటౌన్: వితంతువుపై అత్యాచారం చేసిన ఘటనలో.. నిందితుడిపై చందోలు పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ రాజశేఖర్ వివరాల మేరకు.. పిట్టలవానిపాలెం మండలం, భవనంవారి పాలెం గ్రామానికి చెందిన ఓ వితంతువు ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో.. అదే గ్రామానికి చెందిన పొన్నూరు గోపీచంద్ అనే వ్యక్తి తెల్లవారుజామున ఇంట్లోకి వెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

5న ఉచిత వైద్య శిబిరం

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్(బీఎఫ్‌ఏ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న స్థానిక శ్రీ వేణు గోపాలస్వామి దేవస్థాన ప్రాంగణంలోని శ్రీ సాయికృష్ణ కల్యాణ కళా వేదికలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్, గుండె, మూత్ర పిండాలు, దంత వైద్య పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మణిపాల్ హాస్పిటల్(విజయవాడ) సహకారంతో క్యాన్సర్, గుండెకు సంబంధించి ప్రత్యేక వాహనంలో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మూత్రపిండ వైద్య నిపుణులు డాక్టర్ మహ్మద్ అస్లాం, మూల్పూరు పీహెచ్‌సీ వైద్యులు ఆకురాతి శ్రీనివాసరావు, దంత వైద్య నిపుణురాలు కొన్నిపాటి రోజా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉచితంగా మందులు అందించనున్నట్లు తెలిపారు.

బైక్, సెల్‌ఫోన్ అపహరణ

తెనాలి రూరల్: యువకుడిని పరిచయం చేసుకుని అతడి బైక్, సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడిన ఘటనపై సోమవారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. వేమూరు మండలం పెరవలికి చెందిన నాలా బాలరాజు ఈ నెల 25న అదే జిల్లా చుండూరు మండలం ఆలపాడులో పెయింట్ పనికి వెళ్లాడు. అక్కడ గుర్తు తెలియని యువకుడు పరిచయమయ్యాడు. బాలరాజు బైక్‌పై తెనాలిలో పని ఉందంటూ తీసుకొచ్చాడు. పట్టణంలోకి రాగానే ఇప్పుడే వస్తానని చెప్పి బాలరాజు వద్ద సెల్‌ఫోన్ తీసుకుని అదే వాహనం వేసుకుని వెళ్లిపోయాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా వన్‌టౌన్ పోలీసులు కేసు సోమవారం నమోదు చేశారు.

ఇసుక లారీ సీజ్



కొల్లివర: ఎటువంటి వే బిల్లులు లేకుండా నిబంధనలకు తరలిస్తున్న లారీని అన్నవరం గ్రామం కలకట్ట వద్ద సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ఆర్.రవీంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కృష్ణానది కరకట్టపై వాహనాల తనిఖీలో భాగంగా సిబ్బందితో పరిశీలిస్తుండగా ఇసుకతో టిప్పర్ లారీ వస్తుండగా ఆపి లారీ డ్రైవర్లను వే బిల్లు ఇవ్వమని అడగగా అతను దగ్గర ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఇసుకతో ఉన్న లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంక్షేమంలో సరికొత్త అధ్యాయం

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: వివిధ పథకాలను ప్రవేశ పెట్టి.. ప్రజా సంక్షేమంలో సరికొత్త అధ్యాయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెం–2లో సోమవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మూడున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలను, అర్హత ఉండి.. పథకాలు అందని వారి వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పథకాల లబ్ధిని వివరించే కరపత్రాలను ప్రజలకు అందజేశారు. గ్రామంలో డ్రెయినేజీ, అంతర్గత రోడ్లు, మంచినీటి సరఫరా, శ్మశాన వాటిక తదితర సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని గ్రామస్తులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ.. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా అర్హతే ప్రమాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం నవరత్నాల పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ నేతన్న నేస్తం తదితర 32 సంక్షేమ పథకాల ద్వారా ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూరుతోందన్నారు. జగనన్న పాలన దేశంలో ఒక సువర్ణ అధ్యాయమన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేయడాన్ని.. ప్రతి పక్ష టీడీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. అసత్య ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, కోకిల గడ్డ చెంచయ్య, గవీని కృష్ణమూర్తి, సర్పంచ్ కటికల సుజాత, యోషువ, జొన్నలగడ్డ ఇస్సాక్, ఎండీవో రాధాకృష్ణ, రూరల్ ఎస్సై వెంకట ప్రసాద్, అధికారులు సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ సిద్ధాంతాలు యువతకు స్ఫూర్తిదాయకం



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ జగన్నాథం



గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన ఎంపీపీ లలితకుమారి, ఎంపీడీవో



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

బాపట్ల అర్బన్: అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్తమాసు సత్యనారాయణ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం జీబీసీ రోడ్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ.. హింస, తీవ్రవాదం హెచ్చరిల్లుతున్న నేటి సమాజానికి గాంధీజీ సిద్ధాంతాలు అవసరమన్నారు. అనంతరం కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సభ్యులతో కలిసి మహాత్ముని చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కోళ్లపూడి సురేష్, కోశాధికారి ఉపేంద్ర గుప్త, మామిడి రమేష్ కుమార్, వి.పుల్లయ్య గుప్త, అప్పారావు, నాగరాజు, వేణుగోపాల్, కృష్ణ కిషోర్, రామ్‌ప్రసాద్, మేడ సత్యం, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ సేవలు అజరామరం

రేపల్లె: అహింస సిద్ధాంతంతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన జాతిపిత మహాత్మా గాంధీ సేవలు అజరామరమని రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో గాంధీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, బాపూజీ చిత్ర పటానికి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సిద్ధికి కృషి చేసిన గాంధీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఓల్డ్ టౌన్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి కూడా పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అహింసకు మారుపేరు జాతిపిత

భట్టిప్రోలు: అహింసకు మారుపేరు జాతిపిత మహాత్మా గాంధీ అని భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి పేర్కొన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ.. గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఈ జయచంద్ర కుమార్, మండల సమాఖ్య ఏపీఎం కొండూరు శోభన్, హౌసింగ్, పంచాయతీరాజ్ ఏఈలు రావూరి సౌమ్య, శేతు రామ చంద్రరరావు, సూపరింటెండెంట్ సీహెచ్ జలజ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో..

వెల్లటూరు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పురవీధుల్లో తెల్లవారుజామున 2కే రన్ నిర్వహించారు. నడక ఆరోగ్యానికి ఎంతో మంచిదని తెలియజేస్తూ.. ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద గాంధీజీ, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు నాగళ్ల ఆంజనేయులు, సెక్రటరీ నంబూరు పవన్, కోశాధికారి నంబూరు ప్రసాద్, క్లబ్ నిర్వాహకులు తటవర్తి సోమశేఖర్, నంబూరు నరేంద్ర, సుగ్గుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు హైస్కూల్‌లో..

భట్టిప్రోలు టీఎంరావు హై స్కూల్‌లో మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ప్రధానోపాధ్యాయుడు సి. రామకోటేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు సీహెచ్‌వీ ఉమా మహేశ్వరరావు, కె.కోటేశ్వరమ్మ, కేవీ లక్ష్మీపార్వతి, సీహెచ్ లక్ష్మి ప్రసన్న, డి.లక్ష్మీపార్వతి. ఎం. శ్రీసత్యరత్న, పి.దీప్తి, ఎండీ అనూల్‌హక్ పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి

నగరం: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని సోమవారం స్థానిక ఎస్వీఆర్‌ఎం కళాశాలలో నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. మహాత్మా గాంధీని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గాంధీ చూపిన శాంతి, అహింస మార్గాల్లో పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి. వెంకటనారయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వల్లభనేని విష్ణువర్ధనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్
- హిందూ కళాశాలలో సైన్స్ ఎక్స్‌పో ప్రారంభం



నవరత్నాల వీల్ గేమ్‌ను పరిశీలిస్తున్న ఆచార్య రాజశేఖర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మేయర్ మనోహర్ నాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థుల్ని ఆలోచింపచేసేందుకు అవసరమైన ప్రోత్సాహం లభిస్తుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సహకారంతో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో–2023ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో వైజ్ఞానిక ప్రదర్శల్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేందుకు ఇటువంటి ప్రదర్శనల్ని నిరంతరం ఏర్పాటు చేయాలని సూచించారు. న్యూయార్క్ తదితర ప్రాంతాల్లో ప్రతి ఏటా తప్పనిసరిగా ఒక ఉత్సవంలా సైన్స్ ఎగ్జిబిషన్లను నిర్వహిస్తారని తెలిపారు. నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు మాట్లాడుతూ తాను హిందూ కళాశాల పూర్వవిద్యార్థినేనని చెప్పారు. 300 అంశాలతో నగరంలోని 100 పాఠశాలలు, కళాశాలల్ని సమన్వయ పరచి ఆసక్తికర అంశాలతో సైన్స్ ఎక్స్‌పో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ ఎంతో గొప్ప చరిత్ర ఉన్న హిందూ కళాశాల అంతే స్థాయిలో సైన్స్ ఎక్స్‌పో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. సభలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, హిందూ కాలేజ్–హైస్కూల్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్, ఎక్స్‌పో కన్వీనర్ డాక్టర్ మన్నవ మాధవి, ఆంగ్ల శాఖ అధ్యాపకురాలు చిలకా అరుణ, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గాప్రసాద్ ప్రసంగించారు.

ఆకట్టుకున్న నవరత్నాల ప్రదర్శన

సైన్స్ ఎక్స్‌పోలో భాగంగా కళాశాల అర్థశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో డాక్టర్ పి. వేణుగోపాల్, షేక్ హసీనా రూపొందించిన నవరత్నాలు వీల్ గేమ్ సందర్శకులను ఆకట్టుకుంది. వీల్‌ను తిప్పితే అది ఏ పథకం వద్ద ఆగితే, ఆ పథకం గురించి వివరించి చెప్పిన వారికి ఒక బహుమతి ఇచ్చే విధంగా రూపొందించిన ప్రదర్శనను ఆచార్య రాజశేఖర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మేయర్ మనోహర్ నాయుడు పరిశీలించారు.

నేడు, రేపు ప్రదర్శన

ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నమూనాలను తిలకించేందుకు సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. మంగళ, బుధవారాల్లోనూ ప్రదర్శన కొనసాగుతుందని, ఉదయం 9.00గంటల నుంచి సాయంత్రం 5.00 గంటలలోపు ఉచితంగా తిలకించ వచ్చని నిర్వాహకులు తెలిపారు.

బాల మేధావుల జాబితాలో తనీష్‌కి చోటు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ల్లోకి ఎక్కిన శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ స్కూలు ఒకటో తరగతి విద్యార్థి కందుల తనీష్ మరో అరుదైన ఘనత సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ చెప్పారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అతి తక్కువ వ్యవధిలో ప్రపంచంలోని 65 దేశాల పేర్లు చెప్పడం ద్వారా గతేడాది అక్టోబర్‌లో ఆయా రికార్డ్స్ సాధించిన తమ విద్యార్థి తనీష్ తాజాగా దుబాయ్‌కు చెందిన ద చైల్డ్ ప్రాడజీ ప్రకటించిన ప్రపంచవ్యాప్త తొలి వంద మంది బాల మేధావుల జాబితాలో చోటు దక్కించుకున్నాడని తెలిపారు. మన దేశంలో ఈ ఘనత సాధించిన 26 మందిలో ఒకడు కాగా, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏకైక విద్యార్థి అని వివరించారు. విద్యార్థి తనీష్‌ను డాక్టర్ యలమంచిలి శివాజీ, దేవినేని మల్లికార్జునరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రముఖ హరికథ కళాకారుడు కోటేశ్వరరావుకు సన్మానం

తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం మాయా మచ్ఛీంద్ర చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం యుగపురుషుడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ హరికథ కళాకారుడు బనరావూరి కోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు.

నేడు గుంటూరులో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ



గుంటూరు ఎడ్యుకేషన్: అమెరికాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణుడు నిక్ వుజిసిక్ మంగళవారం గుంటూరు నగరానికి రానున్నారు. పుట్టుకతోనే అరుదైన వ్యాధికి గురై చేతులు, కాళ్లు లేకుండా జన్మించిన నిక్ వుజిసిక్ తనలోని లోపాన్ని లోపంగా భావించక ఆత్మస్థైర్యంతో ఎదిగి, లక్షలాది మందిలో ధైర్యాన్ని నింపే స్థాయికి చేరుకున్నారు. గుంటూరుకు చెందిన ఎస్‌ఆర్ గ్రూప్స్ డైరెక్టర్ బొర్రా నరేష్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని బీఆర్ స్టేడియంలో మంగళవారం సాయంత్రం 4.00 గంటల నుంచి 9,10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్, పీజీ చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు హాజరు కానున్నారు.

నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: నిన్నువలె.. నీ పొరుగు వారిని ప్రేమించు అని ఏసుక్రీస్తు చెప్పిన సూక్తిని ప్రతి ఒక్కరూ పాటించాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. మండలంలోని పెనుమూడి గ్రామంలో జరుగుతున్న జనవరి పండుగ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దేవుని యందు విశ్వాసం ఉంచాలన్నారు. ప్రేమ, కరుణ, దయ యేసు మార్గాలని చెప్పారు. కష్టాల్లో ఉన్న వారిని అక్కున చేర్చుకుని.. ఆ కష్టాలను తొలగించే వారికి ప్రభువు తోడై ఉంటారని తెలిపారు. అనంతరం క్రీస్తు గీతాలను ఆలపిస్తూ ప్రధాన రహదారుల వెంబడి జెండా కర్రకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, సర్పంచ్ దారం విజయ్‌రాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



రోగులను పరిక్షీస్తున్న వైద్యులు

బాపట్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల టౌన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. స్థానిక చీలు రోడ్డులోని ఎకో హౌస్‌లో సోమవారం 300 మందికి వైద్య సేవలందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అలపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలందరూ సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ శిబిరంలో డాక్టర్ శరత్ బోస్, గణేశుల శివరామకృష్ణ, గోపాలం రఘుపతిరావు, రజిని, ఉషారాణి, కోళ్లపూడి సుధాకర్ గుప్తా, ఫణి రాజ సైన్, సంగమేశ్వర శాస్త్రి, కోశాధికారి వంకాయలపాటి హరిబాబు, సెక్రటరీ దండే యజ్ఞ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చెరుకుపల్లి: మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలు వెలకట్టలేనివని రాజవోలు వాసవి క్లబ్ అధ్యక్షుడు యండూరు వెంకట రాఘవేంద్రరావు పేర్కొన్నారు. రాజవోలు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం మహాత్మా గాంధీ వర్ధంతిని గ్రామ ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గూడవల్లి ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల వైద్యులు, వాసవి క్లబ్ వనిత ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 150మందికి పరీక్షలు చేసి, 50 మందికి శుక్లాల శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో రాజవోలు వాసవి క్లబ్ అధ్యక్షురాలు చందులూరి శివనాగ మల్లేశ్వరి, మండలాధ్యక్షుడు మండూరు సత్యన్నారయణ, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు యండూరి మధుసూదనరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జోడో యాత్ర గోడ ప్రతుల ఆవిష్కరణ



గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అంజిబాబు, నేతలు

బాపట్ల అర్బన్: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేపట్టిన జోడో పాద యాత్ర ముగింపు సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో మిఠాయిలు పంపిణీ చేసి, అభినందనలు తెలిపారు. అనంతరం ప్రజా యాత్ర గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దొనేపుడి దేవరాజ్, మండలాధ్యక్షుడు పి.శంకర్ రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకుడు పఠాన్ రాజేష్, సీనియర్ నాయకులు ఎస్‌వీఆర్ కుమార్, మాజీ కౌన్సిలర్ నక్కా రాంబాబు, బక్క రోశయ్య, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ బాజీ, ప్రచార కార్యదర్శి శీలం సాగర్, దోనెపూడి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు



బెల్లపు ఊటతో రూరల్ సీఐ శివశంకర్, ఎస్‌ఐలు

నిజాంపట్నం: నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని రేపల్లె రూరల్ సీఐ ఎ.శివశంకర్ హెచ్చరించారు. మండలంలోని దిండి శివారు యేమినేనివారిపాలెం, అడవల గ్రామాల్లో సోమవారం పోలీస్ శాఖ, సెబ్ అధికారులు సంయుక్తంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివశంకర్ మాట్లాడుతూ.. ఈ రెండు గ్రామాల్లో నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. నాటు సారా సేవించడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. రేపల్లె టౌన్, నిజాంపట్నం, అడవులదీవి, నగరం ఎస్‌ఐలతో పాటు 80 మంది పోలీసు సిబ్బంది కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు.

వేద వ్యాసుని విగ్రహానికి క్షీరాధివాసం



భక్తులతో కలసి యాగశాల ప్రదక్షణ చేస్తున్న భవఘ్ని గురూజీ దంపతులు, వేద పండితులు

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం భవఘ్ని ఆరామం సమీపంలోని వ్యాస సనాతన ధర్మ క్షేత్రంలో వ్యాస భగవానుని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం ఆగమశాస్త్ర ప్రకారం జలాధివాసబింభోధ్యాసన చేసి క్షీరాధివాసం నిర్వహించారు. ఉదయం భవఘ్ని గురూజీ దంపతులు, ప్రతిష్ఠ యాజ్ఞిక బ్రహ్మ, బ్రహ్మశ్రీ నందివెలుగు శ్రీబాలాజీ గురుకుల్ యాజ్ఞిక పర్యవేక్షణలో విఘ్నేశ్వర పూజ, విష్ణు సహస్ర నామ హోమం, ప్రతిష్ఠాపనమూర్తులకు క్షీరాధివాసం చేశారు. సాయంత్రం గీతా యజ్ఞం, ధాన్యాధివాసం, పంచగవ్యాధివాసం, అధివాసాంగ హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవఘ్ని గురూజీ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రపంచ మానవాళిని సన్మార్గంలో నడిపించి ఉజ్వల భవితను ప్రసాదించేందుకు ఆదిగురువు వేద వ్యాసుడు మార్గదర్శకంగా నిలిచాడని తెలిపారు. నాలుగో రోజు మంగళవారం గంధాధివాసం, అధివాసాంగ హోమాలు, సాయంత్రం గీతాయజ్ఞం, శాంతి, దిశ, తత్వానుసంధాధి హోమం, అంగ, ప్రత్యంగ, కళా హోమాలు, కాలాంగ దేవతా హవనములు, ప్రతిష్ఠామూర్తులకు పంచసయ్యాధివాసం, అధివాసాంగ హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజల సమస్యలను పరిష్కరించండి

తెనాలి అర్బన్: వార్డు సచివాలయాలకు వచ్చిన ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఆదేశించారు. పట్టణంలోని 10వ సచివాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే ఉన్నతాధికారుల సూచనలను పాటించాలని చెప్పారు. వారు అడిగిన ప్రతి రిపోర్టును సాధ్యమైనంత త్వరగా అందజేయాలన్నారు. ఆయన వెంట మేనేజర్ అప్పలరాజు ఉన్నారు.